## మూడో ర్యాంక్‌కు కోహ్లీ



దుబాయ్: ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శనతో దిగ్గజ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగుపరచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. కాగా శుభ్‌మన్ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రపంచకప్‌లో అత్యధికంగా 765 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన కోహ్లీ.. గిల్ కంటే 35 రేటింగ్ పాయింట్లు తక్కువగా 791 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. గిల్ 826 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, 824 పాయింట్లతో బాబర్ ఆజమ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ 769 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్నాడు. దక్షిణాఫ్రికాకు చెందిన క్వింటన్ డికాక్ రెండు స్థానాలు దిగజారి 5వ ర్యాంక్‌కు, డారిల్ మిచెల్ అయిదు స్థానాలు మెరుగై 6వ స్థానానికి చేరుకున్నారు. బౌలర్లలో కేశవ్ మహరాజ్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, భారత్‌కు చెందిన మహ్మద్ సిరాజ్ మూడు, జస్ప్రీత్ బుమ్రా నాలుగు, కుల్దీప్ యాదవ్ ఆరవ ర్యాంక్‌లలో నిలిచారు.

## గనెమత్‌కు పతకం ఖాయం



దోహా : ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ షూటింగ్ పోటీలలో యువ షూటర్ గనెమత్ షెకాన్ స్కీట్ విభాగంలో రెండో స్థానంలో నిలిచి భారత పతక ఆశలను సజీవంగా నిలిపింది. కాగా పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ పోటీలలో హృదయ్ హజారిక, మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ విభాగంలో ఎలవెనిల్ వలరివన్ ఏడో స్థానంలో నిలిచి నిరాశపరిచారు. స్కీట్‌లో గనెమత్ మూడు రౌండర్లలో 24/25 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచింది. కజకస్థాన్‌కు చెందిన అస్సెమ్ ఒరిన్‌బే అగ్రస్థానంలో కొనసాగుతున్నది. కాగా మరో నలుగురు షూటర్లు 72 పాయింట్లతో సమానంగా పతకం కోసం పోటీపడుతున్నారు. మహిళల స్కీట్‌లో రమిత జిందాల్, మెహూలి ఘోష్ 9, 10 స్థానాల్లో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయారు.

## లక్నోకు పడిక్కల్, రాజస్థాన్‌కు అవేశ్



న్యూఢిల్లీ: రానున్న ఐపీఎల్ సీజన్ కోసం ప్లేయర్ల బదిలీల ప్రక్రియ కొనసాగుతున్నది. రాజస్థాన్ రాయల్స్, లక్నో సూపర్‌జెయింట్స్ తమ ప్లేయర్లను పరస్పరం బదిలీ చేసుకున్నాయి. ఇందులో భాగంగా రాజస్థాన్ నుంచి దేవదత్ పడిక్కల్ లక్నోకు..మరోవైపు లక్నో స్పీడ్‌స్టర్ అవేశ్‌ఖాన్..రాజస్థాన్‌కు మారారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడుతున్న యువ పేసర్ అవేశ్‌ఖాన్..ఇప్పటి వరకు ఐపీఎల్‌లో 47 మ్యాచ్‌ల్లో 55 వికెట్లు పడగొట్టాడు. గతేడాది జరిగిన మెగా వేలంలో అవేశ్‌ను లక్నో ఫ్రాంజైజీ రూ.10 కోట్లకు తీసుకుంది. యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్..57 మ్యాచ్‌ల్లో 1521 పరుగులు చేశాడు. ఇదిలా ఉంటే ఫామ్‌లేమితో సతమతమవుతున్న సర్ఫరాజ్‌ఖాన్, మనీశ్‌పాండేను ఢిల్లీ క్యాపిటల్స్ వదులుకుంది.

# పోటీపోరుకు సై

**భారత్, ఆసీస్ తొలి టీ20 నేడు • సూర్యకుమార్ సారథ్యంలో బరిలోకి**

**ప్రపంచకప్ తర్వాత మొదటి పోరు**

**రాత్రి 7 నుంచి స్పోర్ట్స్-18లో**



స్టొయినిస్

**భారత్, ఆస్ట్రేలియా మరోమారు ముఖాముఖి పోరుకు సిద్ధమయ్యాయి. ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ఫైనల్లో తలపడ్డ ఇరు జట్లు ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో సై అంటున్నాయి. మెగాటోర్నీ ముగిసిన మూడు రోజుల్లోనే ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు నేడు సముద్రతీర నగరం విశాఖపట్నంలో తెరలేవనుంది. ప్రపంచకప్‌లో తమకు ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని టీమ్‌ఇండియా చూస్తుంటే.. వన్డే చాంపియన్ హోదాలో పొట్టి ఫార్మాట్‌లోనూ సత్తాచాటాలని కంగారూలు కసితో ఉన్నారు. సూర్యకుమార్ సారథ్యంలో టీమ్‌ఇండియా కుర్రాళ్లతో కళకళలాడుతుంటే..ప్రపంచకప్ హీరోలతో ఆసీస్ కదనానికి కత్తులు దూస్తున్నది. మరింకెందుకు ఆలస్యం అత్యుత్తమ జట్ల మధ్య పోరును మనం ఆస్వాదిద్దాం.**



విశాఖపట్నం: వన్డే ప్రపంచకప్ ఇలా అయిపోయిందో లేదో అప్పుడే మరో సిరీస్ అభిమానుల ముందుకు వచ్చేసింది. మెగాటోర్నీ ముగిసి మూడు రోజులైనా కాకముందే భారత్, ఆస్ట్రేలియా మరోమారు మైదానంలో తలపడబోతున్నాయి. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా గురువారం భారత్, ఆసీస్ మధ్య మొదటి మ్యాచ్‌కు విశాఖ ఆతిథ్యమిస్తున్నది. వరల్డ్‌కప్ హీరోలు రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లీ, గిల్, అయ్యర్, రాహుల్, షమీ, సిరాజ్, బుమ్రా లేకుండానే టీమ్‌ఇండియా బరిలోకి దిగుతున్నది. ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గైర్హాజరీలో సూర్యకుమార్‌యాదవ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. వచ్చే ఏడాది వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్ కోసం భారత్ యువ జట్టుతో సిద్ధమవుతున్నది. ఇటీవల సిరీస్‌లో సెలెక్టర్లు సీనియర్లను తప్పిస్తూ ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన యువకులకు జాతీయజట్టులో చోటు కల్పిస్తున్నారు. మెగాటోర్నీ నాటికి టీమ్‌ఇండియా 11 టీ20 మ్యాచ్‌లు ఆడనున్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న వనరుల నుంచి ఆటగాళ్లను ఎంపిక చేసే అవకాశముంది. ముఖ్యంగా వన్డే జట్టుకు భిన్నంగా ప్రస్తుత టీ20 టీమ్‌లో ఎడమచేతి వాటం ప్లేయర్లు బాగా ఉన్నారు. ఇషాన్ కిషన్, యశస్వి జైస్వాల్, తిలక్‌వర్మ, రింకూసింగ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. రెగ్యులర్ కీపర్‌గా ఇషాన్ కిషన్ కొనసాగనుండగా, రిజర్వ్‌గా జితేశ్‌శర్మను ఎంపిక చేశారు. యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించే అవకాశముంది. బౌలింగ్ విషయానికొస్తే..అర్ష్‌దీప్‌సింగ్, అవేశ్‌ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ముఖేశ్‌కుమార్‌తో బలంగా కనిపిస్తున్నది. చివరి రెండు మ్యాచ్‌లకు శ్రేయస్ అయ్యర్ జట్టుతో కలువనున్నాడు. హైదరాబాదీ క్రికెట్ దిగ్గజం వీవీఎస్ లక్ష్మణ్ ప్రస్తుతం టీమ్‌ఇండియాకు చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

**ఆసీస్ జోరుమీద:**


వన్డే ప్రపంచకప్ గెలిచిన ఆసీస్ మంచి జోరుమీదుంది. మెగాటోర్నీ గెలిచిన జట్టులో సభ్యులైన స్మిత్, ట్రావిస్ హెడ్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, జంపా ఉండటం ఆసీస్‌కు కలిసిరానుంది. తమదైన రోజున ఎంతటి ప్రత్యర్థినైనా చిత్తుచేయడంలో కంగారూలు ముందుంటారు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ అందుకు నిదర్శనమని చెప్పొచ్చు. వైజాగ్‌లో గెలువడం ద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో బోణీ కొట్టాలని ఆసీస్ చూస్తున్నది. అనుభవం లేని భారత క్రికెటర్లకు, ఆసీస్‌కు మధ్య పోరు ఆసక్తికరంగా జరిగే అవకాశముంది.

**జట్ల అంచనా**

**భారత్:** ఇషాన్‌కిషన్, రుతురాజ్, సూర్యకుమార్(కెప్టెన్), తిలక్‌వర్మ, శివమ్‌దూబే, రింకూసింగ్, అక్షర్‌పటేల్/సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్‌సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ/అవేశ్‌ఖాన్, ముకేశ్‌కుమార్.

**ఆస్ట్రేలియా:** స్మిత్, షార్ట్, హార్డీ, ఇంగ్లిస్, స్టొయినిస్, డేవిడ్, వేడ్(కెప్టెన్), అబాట్, ఎలిస్, బెహ్రెన్‌డార్ఫ్, సంగా

## టీ20లకు రోహిత్ దూరం



న్యూఢిల్లీ : సమీప భవిష్యత్తులో భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ టీ20 మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని కోరుకుంటున్నట్టు వన్డే ప్రపంచకప్‌కు ముందే తెలిపాడని బోర్డు వర్గాలు వెల్లడించాయి. గత ఏడాది నవంబరులో టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ మళ్లీ టీ20లు ఆడలేదు. అప్పటి నుంచి హార్దిక్ పాండా టీ20 జట్టుకు సారథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. టీ20లకు దూరంగా ఉండాలన్నది రోహిత్ స్వయం నిర్ణయమని, ఆ విషయాన్ని సెలక్షన్ కమిటీ చైర్మన్ అగార్కర్‌కు ముందే తెలిపాడని బోర్డు సీనియర్ సభ్యుడు ఒకరు తెలిపారు. భవిష్యత్తులో పని భారాన్ని తగ్గించుకునేందుకు, గాయాల బారిన పడకుండా ఉండేందుకు అతను ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అన్నారు.

## లక్ష్య, శ్రీకాంత్ ఓటమి



షెన్‌జెన్ : చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు లక్ష్య సేన్, శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. బుధవారం జరిగిన పోరులో ప్రపంచ 17వ ర్యాంకర్ లక్ష్యసేన్ 19-21, 18-21తో వరుస సెట్లలో ఏడో సీడ్ షియుకి చేతిలో ఓడిపోగా, 24వ ర్యాంకర్ శ్రీకాంత్ 15-21, 21-14, 13-21తో ప్రపంచ చాంపియన్ కున్లావత్ వితిదశరన్ చేతిలో పోరాడి ఓడాడు. టాప్ 16లో నిలిచి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలనుకున్న లక్ష్య సేన్, శ్రీకాంత్ ఆశలు ఆవిరయ్యాయి. రజావత్‌కూడా ఓటమిపాలయ్యాడు.

## టెస్టులకు మహిళా క్రికెట్ జట్టు సన్నద్ధత

మెల్‌బోర్న్ : స్వల్పకాలంలో టెస్టు మ్యాచ్‌లకు సన్నద్ధమౌతున్నామని భారత మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అన్నది. ఇప్పటివరకు పరిమిత ఓవర్ల మ్యాచ్‌లకు పరిమితమైన జట్టు డిసెంబర్ 14నుంచి ఇంగ్లండ్‌తో, డిసెంబర్ 21 ఆస్ట్రేలియా జట్లతో టెస్టు మ్యాచ్‌లు ఆడనున్నది. తన సుదీర్ఘ కెరీర్‌లో హర్మన్‌ప్రీత్ కేవలం మూడు టెస్టులు మాత్రమే ఆడింది.




## కోల్‌కతా మెంటార్‌గా గంభీర్

కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్టు మెంటార్‌గా మాజీ కెప్టెన్ గౌతం గంభీర్ వ్యవహరించనున్నాడు. గత రెండు సీజన్లుగా లక్నో సూపర్‌జెయింట్స్‌కు మెంటార్‌గా ఉన్న గంభీర్ తిరిగి కోల్‌కతా గూటికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని సోషల్‌మీడియా వేదికగా గంభీర్ అభిమానులతో పంచుకున్నాడు. లక్నో చీఫ్ కోచ్‌గా ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ జస్టిన్ లాంగర్‌ను నియమించడం గంభీర్ వీడ్కోలుకు కారణమైనట్లు తెలుస్తున్నది. ఇటీవల ముంబైలో షారుఖ్‌ఖాన్‌తో గంభీర్ సుదీర్ఘంగా సమావేశం కావడం దీనికి మరింత బలం చేకూర్చింది. 2011-17 వరకు కోల్‌కతాకు ప్రాతినిధ్యం వహించిన గంభీర్ రెండుసార్లు(2012, 14) ఐపీఎల్ చాంపియన్‌గా నిలిపాడు. రానున్న సీజన్‌లో చీఫ్ కోచ్ చంద్రకాంత్‌తో కలిసి ఈ మాజీ కెప్టెన్ కలిసి పనిచేస్తాడని కోల్‌కతా ఒక ప్రకటనలో పేర్కొంది.

## తెలంగాణకు కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: న్యూఢిల్లీ వేదికగా ఆల్‌ఇండియా సబ్ జూనియర్ కరాటే చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు కాంస్య పతకం దక్కింది. రెండు రోజుల పాటు జరిగిన టోర్నీలో శివ దీపేశ్(50కి), వేదాంశ్ ప్రసాద్(45కి), అలేటి అభినవ్(50కి), శ్లోక్ పాప్రికర్(40కి), అర్జున్ అభిలాష్(50కి)తో కూడిన తెలంగాణ టీమ్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. బాలుర అండర్-12 విభాగంలో శివ దీపేశ్ విజేతగా నిలిచాడు.



వాణిజ్య

## టాటా టెక్నాలజీస్ అదుర్స్

**క్షణాల్లో సబ్‌స్క్రయిబ్ • ఆఫర్‌కు తొలిరోజునే 6.5 రెట్లు బిడ్స్**




న్యూఢిల్లీ, నవంబర్ 22: ఇన్వెస్టర్లు ఆసక్తిగా వేచిచూస్తున్న టాటా టెక్నాలజీస్ షేర్ల కోసం ఐపీవో తొలిరోజునే భారీగా బిడ్ చేశారు. బుధవారం ఆఫర్ ప్రారంభమైనంతనే క్షణాల్లో పూర్తిగా సబ్‌స్క్రయిబైంది. మొదటిరోజున బిడ్డింగ్ సమయం ముగిసేప్పటికి ఇష్యూకు 6.5 రెట్లకుపైగా ఓవర్‌సబ్‌స్క్రిప్షన్ లభించింది. ఐపీవోలో దాదాపు 4.50 కోట్ల షేర్లు ఆఫర్ చేస్తుండగా, ఏకంగా 29.43 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి. ఆటోమొబైల్, ఎయిర్‌లైన్ కంపెనీలకు డిజిటల్ ఇంజనీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సర్వీసుల్ని అందించే ఈ కంపెనీ పబ్లిక్ ఆఫర్ నవంబర్ 24న ముగుస్తుంది. ఆఫర్ ప్రైస్ బ్యాండ్‌ను రూ.475-500గా నిర్ణయించారు.

**ఎగబడ్డ ధనిక ఇన్వెస్టర్లు**

టాటా టెక్నాలజీస్ షేర్లను ఐపీవోలో దక్కించుకునేందుకు హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు ఎగబడ్డారు. రూ.10 లక్షలకు పైబడి మదుపు చేసే హై నెట్‌వర్త్ ఇండివీడ్యువల్స్ కోసం కేటాయించిన 52.73 లక్షల షేర్లకు 6 కోట్ల షేర్లను కోరుతూ బిడ్స్ అందాయి. రూ.2-10 లక్షల మధ్య ఇన్వెస్ట్‌చేసేవారి కోటాకు 11 రెట్లు బిడ్స్ వచ్చాయి. రూ.2 లక్షల లోపు మదుపు చేసే రిటైల్ ఇన్వెస్టర్లకు 1.85 కోట్ల షేర్లను రిజర్వ్‌చేయగా, అందుకు 5.4 రెట్లు 10 కోట్ల షేర్లకు సబ్‌స్క్రిప్షన్స్ అందాయి. సంస్థాగత ఇన్వెస్టర్లు సైతం టాటా టెక్నాలజీస్ ఐపీవోలో భారీ ఎత్తున పాలుపంచుకున్నారు. ఈ ఇన్వెస్టర్ల కోటా 4 రెట్లు ఓవర్ సబ్‌స్క్రయిబ్ అయ్యింది. 4.29 కోట్ల షేర్లకు బిడ్స్ రాగా, అందులో సగానికిపైగా విదేశీ సంస్థాగత ఇన్వెసర్లవే. దేశీయ ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలు 81 లక్షలు, మ్యూచువల్ ఫండ్స్ 37 లక్షలు, ఇతర క్యాటగిరీ దేశీయ సంస్థలు 17 లక్షల షేర్లకు బిడ్ చేశాయి.

**డిసెంబర్ 5న లిస్టింగ్**

టాటా టెక్నాలజీస్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో డిసెంబర్ 5న లిస్ట్ అయ్యే అవకాశాలున్నాయి. సంస్థ ఈక్విటీ మూలధనంలో 15 శాతానికి సమానమైన 6,08,50,278 షేర్లను ఐపీవోలో ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా విక్రయిస్తున్నారు. మాతృసంస్థ టాటా మోటార్స్ 11.4 శాతం వాటాల్ని ఆఫ్‌లోడ్ చేస్తున్నది. ప్రైవేటు ఈక్విటీ ఫండ్ అల్ఫా టీసీ హోల్డింగ్స్ 2.4 శాతం, టాటా క్యాపిటల్ గ్రోత్ ఫండ్ 1.2 శాతం చొప్పున షేర్లను విక్రయిస్తున్నాయి. ఇక గత నెలలో 9.9 శాతం వాటాను టీపీజీ రైజ్ క్లైమేట్‌కు రూ.1,613 కోట్లకు అమ్మేందుకు టాటా మోటార్స్ ఒప్పందంపై సంతకాలు చేసినది తెలిసిందే.

# హైదరాబాద్‌లో యూఎస్‌టీ విస్తరణ

- ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో మరో ఆఫీస్ ప్రారంభం
- 1.18 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటు
- స్థానిక యువతకు కొత్తగా 2వేల ఉద్యోగావకాశాలు
- వచ్చే మూడేండ్లలో 4వేలకు కంపెనీ ఉద్యోగులు




**అభివృద్ధి ఎక్కడుంటే అక్కడికి అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి.**

**అందుకే హైదరాబాద్‌కు దేశ, విదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే ఇక్కడున్న కంపెనీలూ విస్తరిస్తున్నాయి.**

**తాజాగా ప్రముఖ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ కంపెనీ యూఎస్‌టీ సైతం మరో కొత్త సెంటర్‌ను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసింది. దీంతో 2వేల మందికి కొలువులు రానున్నాయి.**



హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో యూఎస్‌టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి కృష్ణ సుధీంద్ర

హైదరాబాద్, నవంబర్ 22 (బిజినెస్ బ్యూరో): హైదరాబాద్.. మరో భారీ ఆఫీస్‌కు వేదికైంది. అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్ సంస్థ యూఎస్‌టీ.. నగరంలో నూతన కార్యాలయాన్ని తెరిచింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, యూఎస్‌టీ సీఈవో కృష్ణ సుధీంద్ర దీన్ని సంయుక్తంగా ప్రారంభించారు. సంస్థ సీవోవో అలెగ్జాండర్ వర్ఘీస్, సీవీవో సునీల్ బాలకృష్ణన్ ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, విస్తరణ ప్రణాళికలో భాగంగా ఇక్కడి క్యాపిటల్యాండ్ ఇంటర్నేషనల్ టెక్ పార్క్‌లో దీన్ని తీసుకొచ్చింది. 1.18 లక్షల చదరపు అడుగుల్లో ఏర్పాటైన ఈ అత్యాధునిక క్యాంపస్‌తో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు రానున్నాయి. వచ్చే 2-3 ఏండ్లలో కొత్తగా 2వేల మందికి పైగా కొలువులు వస్తాయని సంస్థ ప్రతినిధులు బుధవారం తెలియజేశారు. ఇప్పటికే ఈ కంపెనీకి 2వేల మంది ఉద్యోగులుండగా, దీంతో ఆ సంఖ్య 4వేలకు చేరనున్నది.

**వేగంగా విస్తరణ..**

హైదరాబాద్‌లో యూఎస్‌టీ కార్యకలాపాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. 2018లో ఇక్కడ యూఎస్‌టీ కార్యకలాపాలు 250 మంది ఉద్యోగులతో మొదలయ్యాయి. 2021లో ఉద్యోగులు వెయ్యి మందిని దాటిపోగా.. ఇప్పుడు 2వేల మంది పనిచేస్తుండటం గమనార్హం. నిజానికి దేశవ్యాప్తంగా యూఎస్‌టీకి సెంటర్లున్నాయి. హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం, కొచ్చి, పుణె, కోయంబత్తూర్, హోసూర్, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో సాఫ్ట్‌వేర్ డెలివరీ, డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అయితే హైదరాబాద్ డెవలప్‌మెంట్ సెంటర్లనే సంస్థ వేగంగా విస్తరిస్తూపోతుండటం విశేషం. ముఖ్యంగా యూఎస్‌టీకి భారత్‌లో ఇన్నోవేషన్ ల్యాబ్‌లతో కూడిన నాల్గో డెవలప్‌మెంట్ సెంటర్ కూడా హైదరాబాదే. తిరువనంతపురం, కొచ్చి, పుణెల తర్వాత ఇక్కడే కంపెనీకి మరో ఇన్నోవేషన్ ల్యాబ్ ఉన్నది. దేశవ్యాప్తంగా దాదాపు 15,000 మంది ఉద్యోగులున్నారు. ఇతర దేశాలన్నింటిలోనూ ఇంతే స్థాయిలో ఉద్యోగులుండగా, భారత్‌పై సంస్థకున్న ఆసక్తిని ఇది ప్రస్ఫుటం చేస్తున్నది. కాగా, 24 ఏండ్ల క్రితం ఏర్పాటైన ఈ సంస్థ.. 30కి పైగా దేశాల్లో కార్యకలాపాలను సాగిస్తున్నది.

### రాష్ట్ర ప్రభుత్వ కృషితో..

నైపుణ్యం, ప్రతిభ కలిగి అంకితభావమున్న సాంకేతిక నిపుణులకు అడ్డాగా హైదరాబాద్, తెలంగాణ నిలుస్తున్నది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధే కారణమని ఆయా రంగాల ప్రముఖులు విశ్లేషిస్తున్నారు. టెక్నాలజీ రంగంలోని పెద్దలతో తెలంగాణ ప్రభుత్వ నాయకత్వం నిరంతరం సత్సంబంధాలను కొనసాగిస్తుండటం కలిసొస్తున్నదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే యూఎస్‌టీ తాజా విస్తరణ సైతం దీనికి ఓ నిదర్శనంగా పేర్కొంటున్నారు. ప్రధానంగా టీ-హబ్, వుయ్-హబ్‌లతోపాటు స్టార్టప్‌లను ప్రోత్సహించే వ్యవస్థల్ని ఏర్పాటు చేయడం, వ్యాపార-పారిశ్రామిక రంగాలకు ప్రోత్సాహకాలివ్వడం, మౌలిక సదుపాయాలను కల్పించడం భేష్ అని కొనియాడుతున్నారు.

*హైదరాబాద్‌లో మా నూతన కార్యాలయం విస్తరణకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వానికి, క్యాపిటల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థకు కృతజ్ఞతలు. ఈ కొత్త సెంటర్‌తో వ్యూహాత్మక రంగాలు, టెక్నాలజీల్లో స్థానిక యువతకు మెరుగైన అవకాశాలు రాగలవు. ప్రపంచ ఐటీ పరిశ్రమలో హైదరాబాద్ వృద్ధికి కట్టుబడి ఉన్నాం.*

*-అలెగ్జాండర్ వర్ఘీస్, యూఎస్‌టీ సీవోవో*


- ఈ కొత్త ఆఫీస్‌తో స్థానికంగా నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, రిసెర్చర్లకు అవకాశాలు.
- సంస్థకు కలిసిరానున్న హైదరాబాద్‌లోని ఐఐటీ, ఐఎస్‌బీ, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, టీ-హబ్, తెలంగాణ స్టార్టప్ హబ్‌లు.
- హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్, టెలికం, తయారీ, రిటైల్, ఇన్సూరెన్స్ రంగాల్లోని డిమాండ్‌కు తగ్గట్టుగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌గా మారనున్న కొత్త కార్యాలయం.

**రిసెర్చ్ కోసం..**

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ)ల్లో రిసెర్చ్, డెవలప్‌మెంట్ కోసం ఈ కొత్త సెంటర్‌ను వినియోగించనున్నట్టు యూఎస్‌టీ సీఈవో కృష్ణ సుధీంద్ర తెలిపారు. టెలికం, హైటెక్, రిటైల్, ఇన్సూరెన్స్ రంగాలపైనా పరిశోధనలు జరుగుతాయన్నారు.

## త్వరలో సీఎన్‌జీ టూవీలర్లు


*రెండేండ్లలో మార్కెట్లోకి తేనున్న బజాజ్ ఆటో*




న్యూఢిల్లీ, నవంబర్ 22: పెట్రోల్, డీజిల్ ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ద్విచక్ర వాహన వినియోగదారులకు త్వరలో శుభవార్త రాబోతున్నది. ప్రస్తుతం కార్లకే పరిమితమైన సీఎన్‌జీ..భవిష్యత్తులో ద్విచక్ర వాహనాల్లో కూడా అందుబాటులోకి రాబోతున్నాయి. ప్రముఖ వాహన ఉత్పత్తి సంస్థ బజాజ్ ఆటో ఈ దిశగా పరిశోధనలు ప్రారంభించింది. ప్రస్తుతం సీఎన్‌జీ ద్విచక్ర వాహనాలు ప్రారంభ దశలో ఉన్నాయని, 2025 నాటికి ఈ వాహనాన్ని మార్కెట్లోకి విడుదల చేయాలనుకుంటున్నట్టు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బజాజ్ తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సీఎన్‌జీ ద్విచక్ర వాహనాలు లేవని ఒక ప్రైవేట్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

**రెగ్యులేషన్ సమస్యలు అధికం..**

ద్విచక్ర వాహన పరిశ్రమ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, మరీ ముఖ్యంగా రెగ్యులేషన్, పన్నులకు సంబంధించి అధిక సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన విమర్శించారు. మరోవైపు, ఇంధన ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో మూడు చక్రాల వాహన పరిశ్రమలో 60 శాతం సీఎన్‌జీకి మారిపోయారని చెప్పారు. కరోనా ముందు స్థాయికి వాహన విక్రయాలు ఇంకా చేరుకోలేదన్న ఆయన..ఇటీవల కాలంలో ద్విచక్ర వాహన అమ్మకాలు పుంజుకుంటున్నాయన్నారు. మరోవైపు, ప్రస్తుతం ట్రయింఫ్ వాహనాలు నెలకు 10 వేల యూనిట్లు ఉత్పత్తి అవుతుండగా, డిసెంబర్ నాటికి ఉత్పత్తి సామర్థ్యాన్ని 18 వేల యూనిట్లకు పెంచుకున్నట్టు ఆయన ప్రకటించారు. ఇందు కోసం పుణెలోని ఛకాన్ ప్లాంట్‌లో రూ.200 కోట్లతో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.




## సరికొత్త ఇన్నోవా


న్యూఢిల్లీ, నవంబర్ 22: లిమిటెడ్ ఎడిషన్‌గా నయా ఇన్నోవాను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది టయోటా. ఇన్నోవా హైక్రాస్ జీఎక్స్ మాడల్ రూ.20.07 లక్షల నుంచి రూ.22.07 లక్షల మధ్యలో నిర్ణయించింది. వచ్చే నెల చివరి వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నది.

## ముందు జాగ్రత్తగానే రూల్స్ కఠినం

**పర్సనల్ రుణాలపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్**



న్యూఢిల్లీ, నవంబర్ 22: ముందు జాగ్రత్తగానే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు ఇచ్చే అన్‌సెక్యూర్డ్ రుణాలపై నిబంధనలు కఠినతరం చేశామని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ చెప్పారు. రిటైల్ రుణాలపై ఆర్బీఐ ఇటీవల రిస్క్ వెయిట్‌ను 125 శాతానికి పెంచింది. అంటే సెక్యూరిటీ లేకుండా ఇచ్చే ప్రతీ పర్సనల్ రుణం మొత్తంపై ఆయా ఆర్థిక సంస్థలు అంతే శాతం మూలధనాన్ని పక్కన పెట్టుకోవాల్సి ఉంటుంది. ఈ అంశంపై బుధవారం ఫిక్కీ, ఇండియన్ బ్యాంకింగ్ అసోసియేషన్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సులో శక్తికాంత దాస్ మాట్లాడుతూ రిస్క్ ఏర్పడుతున్నట్టు గ్రహిస్తే మరింత జాగురూకతతో ఉండాలని బ్యాంక్‌లకు సూచించారు. వాహన, గృహ రుణాలు, చిన్న వ్యాపార రుణాలపై రిస్క్ వెయిట్‌ను మినహాయించామని, ఆ విభాగాల్లో ఒత్తిడి ఏర్పడుతున్న సంకేతాలేవీ లేవన్నారు.



## బయోఫ్యాక్టర్ బెలోమ్

హైదరాబాద్, నవంబర్ 22: జీవన ఎరువులు, ప్రాణాధార పోషకాల తయారీలో ఉన్న హైదరాబాద్ కంపెనీ బయోఫ్యాక్టర్.. పరిశోధనలో మరో ముందడుగు వేసింది. అనావృష్టి, అతివృష్టిలోనూ మెరుగైన పంట దిగుబడి కోసం అత్యంత సమర్థవంతంగా పనిచేసే 'బెలోమ్' ఫోలియర్ న్యూట్రిమేషన్ సాంకేతికతకు మరింత సామర్థ్యాన్ని జోడించింది. ప్రపంచంలో తొలిసారిగా మెటబోలైట్ అసిస్టెడ్ మైక్రాన్ సైజ్డ్ (ఎంఏఎంఎస్) న్యూట్రిమేషన్ తయారు చేసి బయోఫ్యాక్టర్ ఇప్పటికే విజయవంతంగా విక్రయిస్తున్నది. ఆధునీకరించిన బెలోమ్ ఉత్పాదనపై దేశవ్యాప్తంగా సాగించిన పరిశోధనలలో అద్భుత ఫలితాలు వచ్చాయని బయోఫ్యాక్ ఇన్‌పుట్స్ ఫౌండర్, సీఈవో ఎల్ఎన్ రెడ్డి వెల్లడించారు. మొక్కకు కావలసిన 13 రకాలైన ప్రాణధార పోషకాలు ఏఎంఎంఎస్ విధానంలో ప్రత్యేకించి తయారు చేశామని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ వ్యవసాయ భూముల్లో వరి, మొక్కజొన్న, టమాట, వంకాయలు, బంతి, మిర్చి, పత్తి వంటి పంటలపై పరిశోధనలు జరిపామని చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.